క్లుప్తంగా

కంటి పరీక్షలు చేయించుకోవాలి

చింతకాని: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలను చేయించుకోవాలని సీనియర్ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ మాదిరాజు అశోక్ తెలిపారు. సోమవారం మండలంలోని మత్కేపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 74మంది విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు ఉచితంగా కళ్ల అద్దాలు అందించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాదిరాజు అశోక్‌ను.. హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

వేంసూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా గ్రామస్థాయిలో బీజేపీ కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ల వీరంరాజు అన్నారు. సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు గొర్ల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో రాంబాబు, ప్రసాద్, అప్పారావు, కృష్ణ, సురేంద్రరెడ్డి, మహేష్, శ్రీనివాసరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

కారేపల్లి: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ.. బీజేపీ నాయకులు సింగరేణి తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాన్‌సింగ్, అజ్మీర బిచ్యానాయక్‌లు మాట్లాడుతూ.. ఇప్పటికీ పూరిగుడిసెల్లో నిరుపేదలు నివసిస్తున్నారని, సక్రమంగా విచారణ జరిపి పేదలకు ఇళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, జ్యోతి, కృష్ణ, దేవీలాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

ఎర్రుపాలెం: గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పురుషోత్తం, శ్రీనివాసరావు, జానకి రాములు, భద్రయ్య, సైదులు తదితరులున్నారు.

పల్లెలకు వెలుగు ఏది..?

- అన్ని గ్రామాలకు అందని ఆర్టీసీ సేవలు
- మహిళలకు ఉపయోగపడని ‘మహాలక్ష్మి’
- అధిక చార్జీలు వసూలు చేస్తున్న ఆటోవాలాలు
- ప్రజలకు తప్పని ప్రయాణ కష్టాలు



గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేలా వారి అవసరాలను దృష్టిలో పెట్టుకుని గతంలో ‘పల్లె వెలుగు’పేరుతో ఆర్టీసీ ఆర్డినరీ బస్సు సర్వీసులను గ్రామాలకు నడిపించారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేక పోవడంతో మండలంలోని దాదాపు 90శాతం గ్రామాలకు బస్సు సౌకర్యం లేకుండా పోయింది. దీంతో మహిళలు ఉచిత బస్సు ప్రయాణం పథకానికి దూరం అవుతున్నారు.

కొణిజర్ల: జాతీయ రహదారి పక్కన ఉన్న మండల కేంద్రం కొణిజర్ల, తనికెళ్ల, పల్లిపాడు మినహా మిగిలిన గ్రామాల్లో ‘పల్లె వెలుగు’ కానరాని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు, కూలీలు, ఉద్యోగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా, బీటీ రోడ్లు ఉన్నా బస్సులు మాత్రం నడపడం లేదు. గతంలో స్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నడిపించారు. కానీ, నష్టం రావడంతో ఆర్టీసీ అధికారులు బస్సులను నిలిపివేశారు. విద్యార్థులు ఆటోలపైనే ఆధారపడి ఆయా పాఠశాలలకు వెళ్లాల్సి వస్తుంది.

పల్లెవెలుగు సౌకర్యం అందని గ్రామాలు..

కొణిజర్ల మండలంలో 27 పంచాయతీలుండగా దాదాపు 50 చిన్నా, పెద్ద గ్రామాలున్నాయి. మండల కేంద్రం కొణిజర్ల, తనికెళ్ల, పల్లిపాడు ఖమ్మం రాజమండ్రి జాతీయ రహదారి పక్కనే ఉండటంతో ఆ గ్రామాలకు అన్ని రకాల బస్సు సౌకర్యాలు ఉన్నాయి. ఖమ్మం నుంచి కొణిజర్ల మీదుగా చింతకాని మండలం ప్రొద్దుటూరు వరకు బస్సు సౌకర్యం మూడు ట్రిప్పులు ఉండటంతో ఆ దారిలో గోపవరం, పెద్దమునగాల, రెడ్డి గూడెం గ్రామస్తులకు ఉపయోగపడుతుంది. ఇక మిగిలిన దాదాపు 22 పంచాయతీలకు బస్సు సౌకర్యం లేదు. ముఖ్యంగా పల్లిపాడు నుంచి ఏన్కూరు వెళ్లే రోడ్డులో దాదాపు 14 పంచాయతీలు, 35కు పైగా శివారు గ్రామాలున్నా.. నేటికీ ఆ గ్రామాల ప్రజలకు పల్లె వెలుగు సౌకర్యం ఎలా ఉంటుందో కూడా తెలియదు.

ఆటోలే ఆధారం..

మండలంలోని తనికెళ్ల సెంటర్‌గా తుమ్మలపల్లి, అన్నవరం, అమ్మపాలెం, రాజ్యాతండా, చిన్న గోపతి, అనంతారం వరకు ప్రయాణికులు ఆటోల్లో ప్రయాణిస్తుంటారు. కొణిజర్ల సెంటర్‌గా మల్లుపల్లి, రామనర్సయ్యనగర్‌తో పాటు కొణిజర్ల ప్రొద్దుటూరు, కొణిజర్ల పెద్దగోపతి రూట్‌లతో పాటు చింతకాని మండలం నేరడ, కోమట్లగూడెం గ్రామాలకు చెందిన వారు కూడా ఆటోల్లో కొణిజర్ల వరకు వచ్చి అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. పల్లిపాడు సెంటర్‌గా లాలాపురం నుంచి ఉప్పలచలక వరకు దాదాపు గిరిజన గ్రామాల ప్రజలంతా పల్లిపాడు వరకు ఆటోల్లో వచ్చి పల్లిపాడు నుంచి ఖమ్మం ఇతర ప్రాంతాలకు బస్సులు లేదా ఆటోల్లో వెళ్తుంటారు. ఇక ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎక్కాలంటే కొణిజర్ల లేదా వైరా వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

ప్రయాణికుల ఇబ్బందులు..

కొణిజర్ల, తనికెళ్ల, పల్లిపాడు అడ్డాల ద్వారా దాదాపు 250కు పైగా ఆటోలు నడుపుతున్నారు. ఆటోవాలాలు పూర్తిగా ఆటో నిండే వరకు బయటకు తీయరు దీంతో ఎమర్జెన్సీలో ఆటోల్లో ప్రయాణించడానికి మహిళలు, వృద్ధులు, తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భంగా ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లె వెలుగు బస్సులు గ్రామాలకు తిప్పాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆటోలే దిక్కు..



రామనరసయ్యనగర్ నుంచి కొణిజర్లకు నిత్యం వచ్చి చదువుకోవాలి. గతంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది అది నిలిపివేయడంతో ఆటోల్లో వస్తున్నాం. ఇటీవల పాఠశాలకు ఆటోలో వస్తుండగా ట్రాక్టర్ వచ్చి ఢీకొట్టింది. ఆ ఘటనలో నాతోపాటుగా మరో ఐదుగురు గాయపడ్డారు. చికిత్స అనంతరం నాలుగురోజుల నుంచే బడికి వస్తున్నా.. ఆటోలో ప్రయాణించాలంటే భయంగా ఉంది.

– ఇస్లావత్ వంశీ, 9వ తరగతి విద్యార్థి, రామనర్సయ్యనగర్

ఇబ్బందులు పడుతున్నాం..



పల్లె వెలుగు బస్సులు లేక ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నాం. సొంతంగా ద్విచక్రవాహనం లేకపోతే రాత్రి వేళల్లో ఆటోల్లో ప్రయాణించాలంటే ఎక్కడ ప్రమాదం జరుగుతుందో అని భయపడుతున్నాం. ‘మహాలక్ష్మి పథకం’ కూడా సక్రమంగా ఉపయోగించుకోలేక పోతున్నాం. అధికారులు స్పందించి ఖమ్మం నుంచి పల్లిపాడు మీదుగా ఏన్కూరు వరకు బస్సు నడిపించాలి.

– ముత్తనబోయిన జ్యోతి, గృహిణి, తీగలబంజర

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



తక్కెళ్లపాడు సొసైటీలో రిజిష్టర్లు తనిఖీ చేస్తున్న ఏడీఏ విజయ్‌చంద్ర

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, బనిగండ్లపాడు, ఎర్రుపాలెం సొసైటీల్లో, ఎరువులు, పురుగు మందు దుకాణాల్లో సోమవారం మధిర ఏడీఏ విజయ్‌చంద్ర తనిఖీ చేశారు. దుకాణాల్లో యూరియా నిల్వలు, విక్రయాలు, స్టాక్ వివరాలను పరిశీలించారు. సొసైటీలకు వచ్చిన రైతులకు నానో యూరియా గురించి కూడా అవగాహన కల్పించాలని సూచనలు చేశారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింతగా పెంచాలని సొసైటీ చైర్మన్లకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బోయినపల్లి సాయి శివ, వ్యవసాయ విస్తరణ అధికారులు బాలకృష్ణ, సింధూర్ తదితరులున్నారు.

మీనవోలు హాస్టళ్లలో ప్రత్యేకాధికారి..

మండలంలోని మీనవోలు గ్రామంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లు, బాలికల వసతి గృహాన్ని సోమవారం మండల ప్రత్యేకాధికారి స్వర్ణ విజయ్‌చంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, నివాస గదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ విధిగా పాటించాలని వార్డెన్లకు సూచించారు. ఎంఈఓ మురళీమోహన్‌రావు ఉన్నారు.

నానో యూరియా, డీఏపీలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఓ మయాన్ మంజుఖాన్

వైరారూరల్: మండలంలోని సిరిపురం, తాటిపూడి గ్రామంలో నానో యూరియా, డీఏపీ వాడకంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైరా మండల వ్యవసాయాధికా మయాన్ మంజుఖాన్ రైతులతో మాట్లాడుతూ.. బస్తాల ద్వారా యూరియా వాడకం వల్ల నీటి కాలుష్యం, వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. నానో యూరియా నేరుగా మొక్కకు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఇఫ్‌కో కంపెనీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మహేందర్‌రెడ్డి, ఏఈఓ కీర్తి, రాకేష్, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



పార్టీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం భట్టి

చింతకాని: చింతకానిలో సోమవారం జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సమక్షాన పాతర్లపాడుకు చెందిన సీపీఎం నాయకులు దామాల రవి, కుమ్మరి శివకుమార్, బండి రాజ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు మడుపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున్, బొర్రా ప్రసాద్‌రావు, కాంద్ర పిచ్చయ్య, మద్దినేని నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

తల్లాడ: మిట్టపల్లిని టీబీ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని మండల వైద్యాధికారి రత్న మనోహర్ అన్నారు. సోమవారం మండలంలోని మిట్టపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. టీబీ వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా లక్షణాలున్న 162మంది నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపారు. ఎక్స్‌రేలు కూడా మరుసటి రోజు వచ్చే వాహనంలో తీసుకెళ్లి ఎక్స్‌రేలు తీయిస్తామన్నారు. టీబీ నోడల్ అధికారి పెద్ద పుల్లయ్య, టీబీ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ వై.సురేష్, పల్లె దవాఖానా నర్సింగ్ అధికారి రాజశ్రీ, హెచ్‌వీ ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి రమ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం, భీమవరం, ఎర్రుపాలెం, విద్యానగర్ గ్రామాల్లో సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట



పొలంబాట నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

బోనకల్: మండలంలోని రాపల్లి గ్రామంలో విద్యుత్ అధికారులు సోమవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ ఇంజనీర్ బండి శ్రీనివాసరావు, అసిస్టెంట్ డివజన్ ఇంజనీర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులు తమ పొలాల్లో విద్యుత్ వైర్లు వేలాడినా, విద్యుత్ స్తంభాలు వంగినా.. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారమివ్వాలని సూచించారు. అనంతరం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫారంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ మనోహర్, లైన్ ఇన్స్పెక్టర్లు నరసింహారెడ్డి, పి.రవికుమార్, అర్జున్, సురేష్, రమేష్, గణేష్, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరురూరల్: అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మట్లా రాగమయి అన్నారు. కల్లూరు పర్యటనలో భాగంగా సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో పథకాల అమలుపై.. ఆర్డీఓ రాజేంద్రగౌడ్‌తో కలిసి ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూరియా కొరత రైతులు ఫిర్యాదు చేయగా, ఏఓ రూప స్పందించి మండలంలోని ఐదు సొసైటీల ద్వారా యూరియా సరఫరా చేస్తున్నామన్నారు. వైద్యాధికారి నవ్యకాంత్ మండలంలో సబ్ సెంటర్లద్వారా వైద్యసదుపాయం కల్పిస్తున్నామన్నారు.ఎన్నెస్పీ డీఈఈ రత్నాకర్ మండలంలో 24వేల ఎకరాల ఆయకట్టు సాగులో ఉందని.. ఖాన్‌ఖాన్‌పేట, కొర్లగూడెం లిఫ్టులు మరమ్మతు చేయాలన్నారు. అనంతరం రెవెన్యూశాఖతో పాటు ఐకేపీ, విద్యాశాఖల సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాదేవి, సీడీపీఓ నిర్మల జ్యోతి, పంచాయతీరాజ్‌శాఖ డీఈ రాంబాబు, ఎంఈఓ పత్తిపాటి నివేదిత, ఎంపీఈఓ రంజిత్‌కుమార్, ఐకేపీ ఏపీఎం రాంబాబు, ఈజీఎస్ ఏపీఎం హేమమాలిని, ఆర్‌డబ్ల్యూఎస్, ఉద్యానవన శాఖ, అటవీశాఖ అధికారులు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మార్నింగ్ వాక్..

కల్లూరు: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మార్నింగ్ వాక్ చేపట్టినట్లు ఎమ్మెల్యే మట్టా రాగమయి పేర్కొన్నారు. కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్, కప్పలబంధం రోడ్, వేణుగోపాలస్వామి టెంపుల్ రోడ్, పుల్లయ్యబంజర్ రోడ్ తదితర ప్రాంతాలను ఎమ్మెల్యే, దయానంద్, నాయకులు, అధికారులు కాలినడకన పర్యటించి పరిశీలించారు. ఈ క్రమంలో ప్రజలు డ్రెయినేజీ, పారిశుద్ధ్య పనులు, కొత్త పెన్షన్లు, కోతులు.. కుక్కల బెడద, తాగునీటి సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి.. సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కల్లూరు మున్సిపాలిటీలోని గ్రామాల్లో రహదారుల నిధులకు ప్రణాళికలు చేపడుతున్నామని, సీహెచ్‌సీలో అన్ని పరికరాలు సమకూర్చి డాక్టర్లను నియమించి ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, ఈఓ నాగేశ్వరరావు, పీఆర్ డీఈ రాంబాబు, ఆర్ఐ ఉమామహేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

‘రేషన్’కు ఈ కేవైసీ చేయించుకోవాలి

కారేపల్లి: ప్రతి ఒక్కరూ రేషన్ కార్డుకు ఈకేవైసీ చేయించుకోవాలని, లేని ఎడల ప్రభుత్వ ఆదేశాల మేరకు పేర్లు తొలగించబడుతాయని టెక్నీషియన్ రవికుమార్ పేర్కొన్నారు. రేషన్ దుకాణాల్లో స్కానర్ల అప్‌డేటింగ్ ప్రక్రియను కారేపల్లిలో టెక్నీషియన్‌లు, డీలర్లు సోమవారం చేపట్టారు. మండలంలోని 34 రేషన్ దుకాణాల్లో ఉన్న పాత స్కానర్లను అప్‌డేట్ చేస్తున్నట్లు, ఆధార్ నంబర్‌తో కుటుంబ సభ్యుల వివరాలు వెల్లడవుతాయని, అనంతరం రేషన్ ప్రజాపంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు ధరావత్ భద్రునాయక్, షేక్ అబ్దుల్‌మతీన్, మంగతాయారు, జీసీసీ సేల్స్‌మెన్‌లు శ్రీను, బులిత, లాలు, మంగ్యా, చిన్ని, సుజాత, బొందల జానయ్య తదితరులు పాల్గొన్నారు.



కారేపల్లి రేషన్ దుకాణంలో.. స్కానర్లను అప్‌డేట్ చేస్తున్న టెక్నీషియన్లు, డీలర్లు

మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సహకారం



నగదు అందిస్తున్న మత్స్య సొసైటీ అధ్యక్షుడు కన్నారావు, సభ్యులు

సత్తుపల్లి: గంగారం, బేతుపల్లి మత్స్యశాఖ సహకార సంఘం సభ్యుల ఐక్యతతో ఒక అద్భుతమైన కార్యక్రమాన్ని చేపట్టిందని ఆ సంఘం సొసైటీ అధ్యక్షుడు ఊకే కన్నారావు అన్నారు. సత్తుపల్లి మండలం గంగారం మత్స్యకార సొసైటీ సభ్యులుగా ఉండి మృతి చెందిన కుటుంబాలకు గత మూడు సంవత్సరాలుగా ఒక్కో కుటుంబానికి రూ.9వేలు చొప్పున ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరంలో ఆరుగురు మృతిచెందగా.. వారి కుటుంబాలకు సోమవారం రూ.54వేలు నగదు అందించారు. దీంతో ఎమ్మెల్యే రాగమయి, జిల్లా మత్స్యశాఖ అధికారి, గంగారం పెద్ద దాసరి వెంకట్రామిరెడ్డి(చిట్టినాయన), కాంగ్రెస్ నాయకుడు మధుమోహన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కాకా రామచంద్రరావు, కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ ఊకే చలమారావు, మాజీ డైరెక్టర్ సోయం కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, నాగరాజు, విజయరావు, వినయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..

బాధిత కుటుంబానికి..



నగదు అందిస్తున్న ఆర్యవైశ్య మండల మహాసభ నాయకులు

వైరా: వైరా మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కల్యాణ మండపంలో సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కొల్లా రామారావు కుటుంబానికి రూ.78,500, రాయల శ్రీనివాసరావు కుటుంబానికి రూ.46,500 అందించగా, మిట్టపల్లి నాగేశ్వరరావు మనవరాలు చదువుల నిమిత్తం రూ.10వేలు నగదు సాయం అందజేశారు. ఆర్యవైశ్య కల్యాణ మండపం అధ్యక్షుడు పెరుమాళ్ల కృష్ణమూర్తి, ఆర్యవైశ్య మండల మహాసభ అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్‌కుమార్, మొదటి అధ్యక్షుడు శ్రీనివాసరావు, సత్యంబాబు, వెంకటసుబ్బారావు, చక్రవర్తి, ప్రసాదరావు, కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, రామారావు, సింహాద్రి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం.. మహిళలకు చీరలు..

సత్తుపల్లిరూరల్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా సోమవారం నిరుపేదలకు అన్నదానం, వృద్ధాశ్రమాల్లో ఉన్న మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాస్, ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.


మహిళకు..



నగదు, బియ్యం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్లూరు: కల్లూరులోని కప్పలబంధం రోడ్‌లో నివసిస్తున్న చావల సీత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు రూ.5వేలు, 50కేజీల బియ్యం లను సోమవారం వితరణ చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పొంగులేటి అనుచరుడు యాసా శ్రీకాంత్, నగేష్, ప్రవీణ్, సుబ్బారావు, నాగరాజు, ఈసూబ్, కాంగ్రెస్ యూత్ నాయకులు పాల్గొన్నారు.

హోంగార్డ్ రఘుపతి కుటుంబానికి రూ.46 వేలు..



నగదు అందిస్తున్న హోంగార్డులు

తల్లాడ: మండలంలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన హోంగార్డ్ రఘుపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా తోటి హోంగార్డులు అతని కుటుంబానికి రూ.46 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం హోంగార్డులు భాధిత కుటుంబానికి నగదు అందించి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లయన్స్‌క్లబ్ గవర్నర్ కృష్ణారావు, తదితరులు

తల్లాడ: తల్లాడలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ దారా కృష్ణారావు అధ్యక్షతన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం రాత్రి జరిగింది. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా కోడూరు నాగేశ్వరరావు, కార్యదర్శిగా ఎన్.కనక దుర్గ ప్రసాద్, కోశాధికారిగా అనుమోలు సర్వేశ్వరరావు భాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పీఎంజేఎఫ్ లయన్ డాక్టర్ మోహన్‌రెడ్డి, కాపా మురళీకృష్ణ, బెల్లంకొండ ఆంజనేయులు, దారా శ్రీనివాసరావు, శీలం వెంకట్‌రెడ్డి, మిట్టపల్లి నరసింహారావు, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీసీలంతా ఏకం కావాలి

ఏన్కూరు: రాజ్యాధికారం కోసం బీసీలంతా ఏకం కావాలని బీసీ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. తీన్మార్ మల్లన్నపై జరిగిన దాడిని నిరసిస్తూ మండల కేంద్రంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఇకపై ఇలాంటి సంఘటలు పునరావృతం అయితే బీసీలు చూస్తూ ఊరుకోరని తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు. నాయకులు నాగేశ్వరావు, సత్యనారాయణ, గణేష్, వెంకటేశ్వర్లు, వెంకన్న, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కార్మికుల సమ్మె

కల్లూరు: ప్రభుత్వాస్పత్రిలో కార్మికులు వేతనాల కోసం సోమవారం నుంచి సమ్మె సైరెన్ మోగించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

వేతనాలు పడే వరకు నిరసన ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ మధుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దయాకర్‌తో పాటు పేషెంట్ కేర్ టేకర్లు, స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులు వంశీ, నాగమణి, కోటేశ్వరి, రంజాన్‌బీ, లక్ష్మీప్రసన్న, మేరి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట మత్స్యకారుల ఆందోళన

కారేపల్లి: చెరువుల్లో పెద్దపెద్ద గోతులు తీసి మట్టి దందా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ తహసీల్ ఎదుట సోమవారం కారేపల్లికి చెందిన మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. కారేపల్లి పెద్ద చెరువు, కంబాలకుంట చెరువుల్లో జేసీబీలు పెట్టి పెద్ద పెద్ద గొయ్యిలు తీస్తూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అని చెప్పి కొంతమంది వ్యక్తులు మట్టి దందాకు తెరలేపారని వాపోయారు. అనంతరం ప్రజావాణిలో సింగరేణి తహసీల్దార్ అనంతుల రమేష్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాంబయ్య, సంపత్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాంబాబు పాల్గొన్నారు.

17న జాతర దుకాణాల వేలం

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయపల్లిలో కొలువుతీరిన శ్రీకోటమైసమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే జాతరలో.. ఏర్పాటు చేసే దుకాణాదారులకు ఈ నెల 17న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కొండకింది వేణుగోపాలచార్యులు, పర్సా ట్రస్ట్ చైర్మన్ పట్టాభి రామారావులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ధరావత్తు సొమ్ము చెల్లించాలని, పాట గెలిచిన వారికి 11రోజుల వరకు లైసెన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. బహిరంగ వేలంను ఆలయ ప్రాంగణంలో ఉదయం 11గంటలకు నిర్వహించబడుతుందన్నారు.


తమ్మినేని నివాళి..

చింతకాని: మండలంలోని వందనం గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకుడు అమర్లపూడి సుబుద్ధి(90) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి గోపాలరావు, మండల కార్యదర్శి రాము తదితరులు సందర్శించి నివాళులర్పించి మృతుని కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

మండలానికి చేరిన వంట పాత్రలు

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న వంట పాత్రలు సోమవారం మండల వనరుల కేంద్రానికి చేరాయి. మండలంలోని 38 పాఠశాలలకు 772 శాల్తీల వంట పాత్రలు వచ్చాయి. ఈ పాత్రలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేయనున్నట్లు మండల విద్యాశాఖాధికారి సలాది రామారావు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..



నిరుపయోగంగా ముదిగొండ పీహెచ్‌సీ భవనం

ముదిగొండ: ముదిగొండ కేంద్రంలో ఆరోగ్య ఉపకేంద్ర భవనం ప్రారంభించకుండానే శిథిలవస్థకు చేరుకుంటుంది. దీంతో పాటు డోర్లు, కిటికీలు ధ్వంసమయ్యాయి. ప్రభుత్వం రూ.లక్షల ఖర్చుపెట్టి నిర్మించిన ఈ భవనం నిరుపయోగంగా మారి.. మందుబాబులకు అడ్డాగా మారింది. అధికారులు పట్టించుకోకపోవడంతోనే భవనం దుర్వినియోగం అయింది. కనీసం శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయాన్నైనా ఈ భవనంలోకి మారిస్తే బాగుంటుందని గ్రామస్తులు, విద్యార్థులు కోరుతున్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు కలగజేసుకుని భవనాన్ని ఉపయోగపడేలా చూడాలని కోరుతున్నారు.

దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ నర్సింహ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సీతారాం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీలో ఈ వర్షాకాలం సీజన్‌లో దోమల నియంత్రణకు వైద్య, ఆరోగ్యశాఖతో కలిసి పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ టి.సీతారాంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దోమల లార్వా పెరగకుండా 150 ఆయిల్‌బాల్స్‌ను సిద్ధం చేశామన్నారు. పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలను శుభ్రం చేయించామని, 8 ఫాగింగ్ మిషన్లతో రాత్రి వేళల్లో ఫాగింగ్, నలుగురు జవాన్లతో నాలుగు జోన్లలో స్ప్రేయింగ్ చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.అవినాష్, మేనేజర్ మైసా శ్రీనివాస్ పాల్గొన్నారు.